అడుగులు వేసుకుంటూ గూడానికి నడక సాగించింది.

ఊరి బయట దేవతకు పూజ చేస్తూ సీమా కనిపించింది. అక్కడ అంతా చీకటిగా ఉంది. ప్రమిద వెలుగులో సీమాముఖం మాత్రం కనిపిస్తోంది. ఆమె కన్నులు మూసుకుని ఉంది. రాజీ నిశ్శబ్దంగా అక్కడకు వెళ్ళి ఒక పక్కగా చీకటిలో నుంచుంది. సీమా కన్నుల వెంట నీరు కారుతోంది. ధర్మం జయించేటట్లు చేయమనీ, తన ప్రసాద్‌కు ఏ ఆపదా రాకుండా చూడమనీ ఆమె దేవతను ప్రార్థిస్తోంది. సీమా ప్రార్థనలు విన్న రాజీ తలవంచుకుని నిశ్శబ్దంగా తన ఇంటికి నడిచి వెళ్ళిపోయింది.


సీమా అక్కడ నుంచి స్థావరానికి బయలు దేరింది. స్థావరం వెలుపల ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ నిల్చున్న కెప్టెన్ ప్రసాద్ సీమానుచూసి చకితుడయ్యాడు. ఆవేళప్పుడు ఆమె అక్కడకు రావలసిన అవసరం ఏమిటో అతను ఊహించ లేక పోయాడు. తనవెంట రమ్మన్నట్టుగా చూసి ఆమె ముందు నడిచింది. అతను అనుసరించాడు. ఇద్దరూ వెన్నెలలో ఒకరాయి మీద కూర్చున్నారు. దేవత పాదాల దగ్గర్నుంచి తెచ్చిన బొట్టుతీసి అతని ముఖానికి పెట్టింది. "ఇందు కోసమే వచ్చాను" అన్నట్లుగా అతని కళ్ళలోకి చూసింది. ఇద్దరూ మౌనంగా అలా చాలా సేపు కూర్చున్నారు. మౌనభాషలోనే ఏవో మాట్లాడుకున్నారు. "ఈ రోజు నా కోసం నువ్వు రాలేదు. అందుకోసం నేనే వచ్చాను నీ దగ్గరికి" అని చెప్పింది ఆమె. కొంతసేపయాక "ఇక వెళతాను" అన్నట్లు చూసి లేచింది. అతనూ లేచాడు. చేతిలో చేయి వేయమని చెయ్యి చాపింది. అతను చేతిలో చేయి వేశాడు. "ఇక మనకు వివాహం అయిపోయింది. మనల్ని ఎవ్వరూ విడదీయలేరు. జన్మజన్మలకి ఇద్దరం ఒక్కటి" అన్నభావం ఆ క్షణం ఇద్దరిహృదయాలలో స్పందించింది.

సీమా మెల్లగా నడిచి చెట్లనీడల చీకటిలో కలిసిపోయింది. కాసేపటికి తేరుకున్నాడు కెప్టెన్. కల తొలగినట్లు, నిద్ర మేలుకొన్నట్లు అనిపించింది. ఇప్పుడు జరిగినదంతా, తను పొందిన అనుభవమంతా నిజమేనా కేవలం కలేనా అని సందేహం కలిగింది. అసలు మొదటినుంచీ తనూ ఆమె కలుసుకున్న సంఘటనలన్నీ కలల్లాగానే కనిపించాయి. వాస్తవానికి చాలా దూరంగా కనిపించాయి. కానీ, ఒక్కొక్కప్పుడు కల్పనకంటే వాస్తవమే విడ్డూరంగా ఉంటుందన్న మాట జ్ఞాపకంవచ్చింది. శిబిరానికి వచ్చి అద్దంలో చూసుకుంటే సీమా పెట్టిన బొట్టు నుదుట మెరుస్తూ కనిపించింది. మనస్సు చేసిన కల్పన కాదు, నిజమే అనడానికి అది నిదర్శనంగా కనిపించింది.

(సశేషం)



నాటిక



# భర్త మార్కండేయ

బి. వి. రమణారావు

## 1 వ రంగం

[తెర తీసేటప్పటికి రంగస్థలం ఖాళీగా వుంటుంది. రంగస్థలం ఓ వీధి. తెర వెనకనుంచి, అంటే ఓ యింట్లోనుంచి హనుమంతరావు, అతని భార్య మధ్య జరిగే సంభాషణ వినబడుతూ వుంటుంది.]

హ. భా— ఎంతసేపూ మీ స్నేహితులూ, మీ క్లబ్బూ, మీ పేకాట, మీసరదాలేకాని, ఓ రోజు కాపోతే ఓ రోజయినా యింట్లో ఏం కావాలో కనుక్కోడం వుంటేనా!

హ— ఓ! అదా! ఏం కావాలి?

హ. భా— ఏం కావాలేమిటండి! నా మొహం! ఎన్నిసార్లు చెప్పమంటారు! ఇంట్లో సరుకులు నిండుకున్నాయని చెప్పి వారం రోజులయింది.

హ— అలాగే.

హ. భా— కుర్రదానికి డాక్టరు రాసిచ్చిన మందు చీటీ అలాగే పడుంది. దానికి రోగం తగ్గిలోగా మందింటికి వచ్చేదారి కనపడదాయె!

హ— అలాగే.


హ. భా— చంటాడికి వొచ్చే మంగళారం పుట్టినరోజు. ఓ చొక్కా గుడ్డ కొని పడెయ్యమంటే వినిపించుకోరు కదా!

హ— అలాగే.

హ. భా— అన్నింటికి అలాగే అంటే ఎలాగండి!

హ— ఏం చెయ్యమంటావ్?

హ. భా— ఏంచెయ్యమంటా



వనకపోతే ఈపూట శలవు కదా, బజారుకెళ్ళి రాకూడదూ చెప్పండి.

హ— ఓ! అదా! ఇదుగో ఇప్పుడే (అంటూ రంగస్థలం మీదకి ప్రవేశిస్తూ, అంతకి ముందే వచ్చి, ఈ సంభాషణ పొంచి వింటున్న కుటుంబరావునుచూసి) ఎంత సేపయిందిరా వచ్చి?

కు— ఇప్పుడే. ఇంట్లో ఏమిట్రా గందరగోళం!

హ— నిలయ విద్వాంసుల వాద్య సమ్మేళనం.

కు— ఎవరిమీదరా మీ ఆవిడలా విరుచుకు పడుతుంది!

హ— పై వాళ్ళెవరి మీదా కాదు. నామీదే. కొత్తేమీలేదు. పరిపాటే. పొద్దున్నే దాసీ మనిషి మీద మాఆవిడ ఏకధాటిగా వర్షించే తిట్లతోటి నాకు మెలుకువొస్తుంది. తర్వాత పాలవాడు నీళ్ళ పాలు పోస్తున్నాడని చేసే ప్రళయ తాండవంతాలూకు సప్తస్వరాలతోటీ మత్తు వొదులుతుంది. ఆపైన మాఅమ్మాయి టూత్‌పేస్టు ఐస్క్రీంలాగ తినేసినందుకో, లేకపోతే పాలగ్లాసు తన్నేసినందుకో, దెబ్బలుతిని 'బేర్' మంటూ నాదగ్గిరికి రాగానే ఒళ్ళు విరుచుకు లేస్తాను. ఇంతట్లోకే వాంటింట్లోంచి 'అర్ధరాత్రయితేనే కాని యిల్లు జ్ఞాపకంరాదు, తొమ్మిదయితే కాని తెల్లారదు. చూడు నాన్నగారు లేచి మొహం కడుక్కున్నారేమో' అన్నమాఆవిడ కేకవినపడగానే పళ్ళు తోముకోవాలన్న విషయం జ్ఞాపకమొస్తోంది. ఇప్పుడు నువ్వు విన్నావుచూడు. ఇది రోజూ ఆఫీసుకు బయలుదేరే టైములో జరిగేవీడ్కోలు కార్యక్రమమన్నమాట.

కు—బాగుందిరా బ్రదర్. నవరసభరితంగా వుంది నీసంసార జీవితం. ఒద్దురా బాబూ పెళ్ళిచేసుకోవద్దురా అని తల మొత్తుకు చెబుతే విన్నావూ! అయితే యిప్పుడు గతితప్పిన గ్రహంలాగా బజారమ్మట పడిపోయి మీ ఆవిడి చెప్పినవన్నీ కొనుక్కురావడానికి పోతున్నావన్నమాట!

హ— చూడు, మా ఆవిడచెప్పిన పనులన్నీ చేసేస్తే రేపట్నుంచి నా సంసారజీవితం యెంత పేలవంగా వుంటుందో ఆలోచించు. అసలు టెంపోయే పోతుంది. ఈ పన్లన్నీ చెయ్యకపోవడమే నాకూ ఘంసారానికీ బంధం. ఈ బంధం తెగిపోకుండావుండటానికైనా ఈ పన్లన్నీ చెయ్యకపోవడం నా విధి. ఇంతకీ ఇంత పొద్దున్నే తగులడ్డావు, ఏమిటి విశేషం!

కు— మన మార్కండేయుడి సంగతి తెలుసా?

హ— ఏం చచ్చేడా!

కు— నిన్నటివరకూ అలాంటి శుభవార్త వినలేదు. కాని ఆ ప్రయత్నంలోనే వున్నాట్ట.

హ— పాపం! అదేం!

కు— మొన్న నెందుకో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాట్ట. "ఆత్మహత్య మహాపాపం" అన్న సినీమా డైలాగ్ జ్ఞాపకంవొచ్చి మళ్ళీ విరమించుకున్నాట్ట. అలాంటి చవట చస్తేనే మంచిది.

హ— పదికాలాలపాటు బతకాలని మంచి ముహూర్తంచూసి వాళ్ళ వాళ్ళు మార్కండేయుడని బారసాల చేస్తే తీతువుపిట్టలాగా చావాలి చావాలంటా వేమిట్రా!

కు— బ్రదర్! మనవాళ్ళు పేర్లు పెట్టడంలో దేవతలపట్ల ఘోరమైన మహాపాపం చేస్తున్నారనుకో. కొంప మునిగిపోయినట్టు పుట్టిన పదిరోజులకే సార్థకనాము డవ్వకపోతాడా అని వాళ్ళకి నచ్చిన దేవుళ్ళపేర్లు తగిలించేస్తూంటారు. తీరా చూస్తే శ్రీరామచంద్రుడని పేరున్నవాడు, భార్య వుండగా ఏ పక్కింటి అహల్యనో లేవదీసుకుపోతున్నాడు. హరిశ్చంద్రుడని పేరెడితే వాడు ఏ నల్లబజారు వర్తకసంఘానికి ప్రెసిడెంటుగానో తయారవుతాడు. మృత్యుంజయుడని పేరెట్టిన కుర్రాడు అన్నప్రాశనకే వుండడు. ముద్దు ముద్దుగా అమ్మాయికి "సుందరి" అని పేరెడితే ఎదిగి శూర్పణకని మరిపిస్తుంది. నా పేరు కుటుంబరావు. నేనుచూస్తే ఘోటకబ్రహ్మచారిని. నీ పేరు హనుమంతరావు. మీ ఆవిడపేరు సీత. ఇంతకంటె దైవదూషణ మరోటుందా! ఎన్నో సాంఘిక దురాచారాల్ని సంస్కరించిన మహానుభావులదృష్టిలో ఈ విషయం పడకపోడం శోచనీయం.

హ— అయితే ఎలాంటి పేర్లెట్టాలంటావ్!

కు— వెరీ సింపుల్. పిల్లలు పెద్దవాళ్ళయి ఏదో వృత్తో, ఉద్యోగమో, వ్యాపారమో, కాలక్షేపమో మొదలెట్టేక, పంచతంత్రంలో విష్ణుశర్మ పెట్టినట్టు: వాళ్ళ అభిరుచుల్నిపట్టి, రూపురేఖల్నిపట్టి, పార్టీ బలాల్నిబట్టి వాళ్ళకి నచ్చినపేర్లు వాళ్ళే పెట్టుకుంటారుగా. అంతవరకూ యింటిపేర్లతో నెంబర్లు పెట్టి పిలుచుకుంటే తప్పా! దీనికి కూడా ఓ చట్టం కావాలా! (అప్పుడే ఓ నౌకరు కుర్రాడు ఓ ఉత్తరం పట్టుకొచ్చి హనుమంతరావు కిస్తాడు. వాణ్ణి చూసి) ఎవడీ యమదూత!

హ— మార్కండేయుడి దగ్గర పనిచేసే కుర్రాడు. (ఉత్తరం తీసుకుని చదువుకుంటూ వుంటాడు.)

కు— నీ పేరేమిట్రా?

నౌ— సన్నాసి.

కు— శహభాష్! గుణానికి, రూపానికి తగ్గ పేరు. ఒరేయి సన్నాసీ, నీ తల్లితండ్రులు ధన్యులు. ఇంతకీ మార్కండేయుడు ఎప్పుడు చచ్చేడు?

స— చావడమేమిటంటి బాబూ! రాయిలాగుంటే. నిలబడ్డ పళంగా ఈ యనుమంత్రావుగార్ని, నాలు గిళ్ళవతల అదేదో పేరు చెప్పేరండి ఆర్నీ తీసుకు రమ్మన్నారండి.

కు— నా పేరే అయ్యుంటుంది. కుటుంబరావు అన్నాడా!

స— ఆఁ... అవునండి. అదే యదవపేరు నోరు తిరగలేదండి.

కు— వెధవ నోరనబోయి వెధవ పేరని వుంటావు. నీ వ్యాకరణ దోషాన్ని క్షమించేనుకాని, నీ గులాబ గుంయ్యిమనీలోగా పరిగెత్తుకెళ్ళి వొస్తున్నారని చెప్పు.

స—(పోతూ పోతూ) మిమ్మల్ని ద్దర్నీ కూడా యంటబెట్టుకు రమ్మన్నారండి. చాలా బయ్యంపడుతున్నారు.

కు— వాడికి నీకుకూడా అభయ హస్త మిచ్చేను. పో. (హనుమంతరావు కేసి తిరిగి) ఏమిట్రా! అలా ఏడుపు మొహం పెట్టేవు! ఏం రాశాడు ఉత్తరంలో?

హ— వాళ్ళ నాన్నదగ్గిర్నుంచి వుత్తరం వొచ్చిందిట. వీడి మేనమామ కూతురికి ఆరోజు కారోజు పెళ్ళీడు ముంచుకొస్తుందని - గంతులేస్తున్నాట్ట. వెంటనే ఆ సంబంధాని కొప్పుకోపోతే తన విల్లులోంచి వీడి పేరు కత్తిరించిపారేస్తానని చిందులు తొక్కుతూ వీళ్ళ నాన్న వీడికి నోటీసిచ్చేడుట.

కు— ఆహా! ఎంత మహా ఘోర పాతకం! పురాణయుగంలో నూటికీ కోటికీ తపోభంగం చెయ్యడానికి ఆడదాన్ని మొగాడిమీదికి ఉసికొల్పేవారు. ఈ పెళ్ళనే సాంఘిక దురాచారం పేరిట ఆడదాని దౌర్జన్యం నుంచి తప్పించుకున్న బ్రహ్మచారి మచ్చుకు కనబడడు. ఇంటికీ, కంటికీ, వొంటికీ, వంటకీ ఆడది బాగుంటుందని పొగుడ్తుంటే నిజమేనని నమ్మి మోసపోతాడు మొగాడు. పెళ్ళంటే మొగాడి అమాయకత్వానికి సమాజం జరిపే సన్మానసభ అని తెలుసుకోలేక, దానికి జరిపే కట్నాలూ కానుకలు మొదలైన ఏర్పాట్లన్నీ విని మురిసిపోయి ఈసంసారమనే కబంధ హస్తాల్లో ఇరుక్కుంటాడు. పాపం! మార్కండేయుడి కెంత కష్టం వొచ్చింది! ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడంటే ఆశ్చర్యమేముందీ!

హ— నేనూ మార్కండేయుడూ ఇంటర్మీడియట్ చదివిన నాలుగేళ్ళూ కలిసి-మెలిసి ఒకే రూంలో వుండేవాళ్ళం. వాడు మంచి స్పోర్ట్స్‌మన్. టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్ ఆటల్లో మేధావి. పైగా బోలెడు బుద్ధిమంతుడూ. క్లాసులో వెనకబెంచీమీద కూర్చుని వేరుశనక్కాయలో, బఠానీలో తింటూ బుద్ధిగా సినిమాపత్రికలో, స్పోర్ట్స్ పత్రికలో చదువుకుంటూ పాఠాల జోలికిపోయి అల్లరి చెయ్యకుండా కాలక్షేపం చేసేవాడు. ఎకనమిక్సూ, హిస్టరీ లెక్చరర్లయెడల కడు వినయ విధేయతలతో వుంటూ అటెండెన్స్ తీసుకున్న మరుక్షణంలోనే శలవు తీసుకుని వెళ్ళిపోయేవాడు. చెట్టంత విద్యార్థి అలా గౌరవిస్తుంటే మురిసిపోయి లెక్చరర్లు చిరునవ్వుతో వీడ్కోలిచ్చేవారు. తెలుగు లెక్చరరయితే చెప్పనే అక్కర్లేదు. అటెండెన్స్ అవగానే "నాయనా... మార్కండేయా! నా క్లాసులో కూర్చుని నీవిలువయిన కాలం పాడుచేసుకోకు. వెళ్ళి ఫుట్‌బాలాడుకో" అనిదీవించి పంపేవాడు. పైగా వాడికి ఆడపిల్లలంటే మహా భయం. ఆడదంటే ఆదిశక్తనీ, దగ్గిరిగా వెడితే ప్రేమనే నోటితో మింగేస్తుందనీ వాడి నమ్మకం.

కు— వాణ్ణిగురించి నాకు చెప్పాలా! బ్రహ్మచర్య ధర్మసంస్థాపనోద్యమంలో నాకు ముఖ్య శిష్యుడు. హుఁ! అలాంటి మహాతపస్వికా యిలాంటి ప్రమాదం! ఇంకా ముహూర్తం పెట్టలేదుకదా!

హ— ఇంకా లేదు. కాని వాళ్ళ నాన్నధోరణిచూసి భయపడి పెళ్ళిచేసుకుంటానంటాడేమో. పెళ్ళిమీదకి వెళ్ళేవాడి మనస్సుని బ్రహ్మచర్యం మీదకి లాగి తాపడం చెయ్యాలి. దానికి నువ్వే సమర్థుడివి.



కు— ప్రయత్నం పురుష లక్షణం అన్నారు. పైగా అభయ హస్తం కూడా యిచ్చేనా మరి.? పద పోదాం.

◆ ◆ ◆

## 2 వ రంగం

[మార్కండేయుడి గది. కాలేజి విద్యార్థికి ఉండవల్సిన హంగులూ అలంకారాలూ గదిలో వుంటాయి. మార్కండేయుడు తడిటర్కిష్ టవల్ నెత్తిమీద వేసుకుని కుర్చీలో కూర్చుని దిగులుగా ఆలోచిస్తూ వుంటాడు. నౌకరు సన్యాసి గ్లాసుతో మధ్య మధ్య కొంచెం నీళ్ళు మార్కండేయుడి నెత్తిమీదున్న టవల్‌మీద జల్లుతూ వుంటాడు.]

మా— (దిగులుగా) ఒరేయి సన్నాసీ! నీకూ నాకూ ఋణం తీరిపోయిందిరా. నాకు మళ్ళీ చచ్చిపోవాలని వుందిరా.

స— అంతమాటనకండి బాబూ. మీరు చస్తే, నేమాత్రం బతుకుతానా.

మా— మరయితే మా నాన్న చెప్పినట్టు పెళ్ళి చేసుకోమంటా వుట్రా !

స— ఛ. ఛ! తమ కర్మ క్షేమం కాలింది బాబూ! దిక్కుమాల్ని పెళ్ళి. ఇన్నాళ్ళూ యింత దర్జాగా బతికిన కళ్ళతోటి తమరూ యదవ సంసారం బతుకు బతుకుతుంటే సూళ్ళేను బాబూ.

మా— నాకీ గండం గడిచే ఉపాయం కనబడ్డం లేదురా.

స— ఎంత కష్టమొచ్చింది బాబూ! తమ బాద సూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. దేవుడు లాంటి మనిషికందా! తమ కా యీ పెళ్ళి బాద !

మా— సన్యాసీ! నే చచ్చిపోతే నా పర్సులో డెబ్బయి రూపాయి లున్నాయి. అవి నువ్వు తీసుకో.

స— (చొక్కా కొనతో కళ్ళు ఒత్తుకుంటూ) ఇంకెక్కడి డెబ్బయి బాబూ! ఇంక ఏభయ్యే వుంటాయండి. పొద్దున్నే తమకి తెలియకుండా, పాపిష్టోణ్ణి, యిరవై తీసేసుకున్నానండి. తమరిలాగంటారని తెలుస్తే తమ డబ్బు అగ్గిలా చూసుకునేవాణ్ణి.

కు— (హనుమంతరావుతో ప్రవేశించి) ఏమిట్రా ఈ నెత్తిమీద జలపాతం! గంగావతరణం సీనులాగుంది!

మా— హృదయంలో అగ్ని జ్వాలలు! మనస్సులో మారణహోమం! మెదడులో అగ్ని పర్వతాలు! బుర్ర వేడి! ఒళ్ళుమంట! ఇక నే బతకను.

హ— ఒరేయి మార్కండేయుడూ! కష్టాలొచ్చినప్పుడే ధైర్యంగా వుండాలి. కష్టాలు కలకాలం మంచి వాళ్ళకి ఏ సినిమాలో నేనా వున్నాయా! ఇంటర్వెల్ వరకూ కష్టాలుంటే తర్వాత సుఖాలుంటాయి. ఇంటర్వెల్ వరకూ సుఖాలుంటే తర్వాత కష్టాలు, చివర్న మళ్ళీ సుఖాంతం అవుతుంది. ఏమంటావురా కుటుంబ్రావ్!

కు— సెంట్ పర్ సెంట్ కరెక్ట్. ఇంతకీ భయపడవలసినంత ప్రమాదమేమొచ్చిందీ!

స— ఇంతకంటే ప్రమాదమేం రావాలిబాబూ!

మా— ఏరా హనుమంతూ! వుత్తరంలో సంగతులు వాడికి చెప్పలేదూ?

కు— చెప్పేడు, గ్రహించేను. దాన్ని గురించే ఆలోచిస్తున్నాను.

మా— హనుమంతూ! వాడాలోచిస్తూ కూర్చుంటాడుగాని, ఈ లోగా ఏదైనా విషం తెచ్చిపెట్రా, తకీమని చంపేసేది.

హ— అబ్బబ్బ! అంత బెంబేలు పడిపోతావేమిట్రా! పోనీ



అంత చావుకు తెగించిన వాడివి పెళ్ళాడేసెయ్యకూడదూ !

స— చ ఛ. అదేం సలహా బాబూ! పెళ్ళైనా ఆపండి. లేదా మా అయ్యగార్ని దర్జాగా చావనీండి. (మార్కండేయుడి వైపుతిరిగి) పోనీండి బాబూ ఆయన విషం తేక పోతే తమచావు ఆగుతుందా! తమరు ఊం అన్న క్షణంలో నాబొందిలో పాణం వుండగా తమర్ని పేణాలతో వొదిలేస్తానా!

కు— నీ ప్రభుభక్తికి సంతోషించాంకాని, నువ్వు నోరు మూసుకుంటావా నిన్ను నిలువునా యిక్కడ పాతెయ్యమంటావా! (మార్కండేయుడితో) ఒరేయి ఈ ఫళంగా నువ్వు-"మీరందరూ కట్టకట్టి గంగలో దూకినాసరే నేను పెళ్ళాడను" అని మీనాన్నకి వుత్తరం రాస్తే ఏమౌతుంది?

మా— మా అమ్మ గుండాగిపోతుంది. మా మేనమామ ఉరేసుకుంటాడు. వాడి కూతురు నూతిలో దూకుతుంది. మానాన్న నన్ను ఉప్పు పాతరేస్తాడు.

కు— గట్టి చిక్కే వొచ్చిందే !

హ— చస్తే చస్తావు. నా మాట విని పెళ్ళాడేసెయ్యరా. మీ వాళ్ళందరూ సంతోషిస్తారు.

కు— తాచెడ్డకోతి వనమంతా చెరిచిందనీ ! ... ఇదా నీ బోడి సలహా !

మా— (నిస్పృహతో) వాడు చెప్పినమాట్టికొట్టెయ్యడానికి వీల్లేదు. నా బతుకెలాగా చెడింది. తల్లి తండ్రుల్ని సంతోషపెట్టడానికైనా పెళ్ళాడేస్తా.

కు— పెళ్ళంటే నూరేళ్ళమంట. మీ నాన్నేదో రాశాడని మంటలో దూకేస్తావా! ఏదో ఉపాయం ఆలోచించాలికాని.

మా— ఇంకా ఎప్పుడు ఆలోచిస్తావురా! ప్రళయం లాగ పెళ్ళి మీదకి విరుచుకు పడిపోతుంటే ! ఇదిగో మా నాన్న రాసిన ఉత్తరం చదువు.

కు— (ఉత్తరం పైకి చదువుతూ) "చిరంజీవి మార్కండేయుణ్ణి ఆశీర్వదించి వ్రాయునది. ఉభయకుశలోపరి. నిన్ననే కాంతారావు వద్దనుంచి ఉత్తరం వచ్చినది..." ఎవడీ కాంతారావు !

మా— నా ప్రాణాంతకరావు. మా మేనమామ.

కు— "...ఉత్తరం వచ్చినది. చిరంజీవి మూలకి......" మూల ఏమిట్రా! మూలా, సందూను !

మా— మా మేనమామకూతురు. ఏ నక్షత్రానికి పుడితే ఆ నక్షత్రం పేరెట్టడం వాళ్ళ వంశంలో అనవాయితీ.

హ— అయితే ఏరి ఏరి మూల నక్షత్రాన్ని పుట్టిందన్నమాట! భేష్ ! ఊం... చదువు.

కు— "చిరంజీవి మూలకి పెళ్ళీడు వొచ్చింది కనక ఇక ఆలస్యం చెయ్యకుండా ముహూర్తం పెట్టించమని తొందర చేయుచున్నాడు..."

హ— ఏడవ లేక ఛోవుచున్నాడు...!

మా— (ఏడుపు ధోరణిలో) వీడేరా నా పాలిటి యముడు. వీడోమూలా వీడి కూతురు మూలో మూలా పెళ్ళో పెళ్ళో అని పీక్కు తినేస్తున్నారు.

హ— ఎక్కడో కొండచిలువలాగున్నాడే!

స— అసలు యీ మావఁలమూలాన్నేబాబూ యీ పెళ్ళిళ్ళ పేచీలు. ఊ... ఆళ్ళ కూతుళ్ళు కొంచెం అడ్డం పొడుగూ ఎదిగేటప్పటికి, కాస్తంత ఒడ్డూ పొడుగూ వున్న మొగాడు కనబడితే లటుక్కున గేలంవేసి లాగేసి పెళ్ళిళ్ళు చేసెయ్యడం! చ ఛ! యదవమావఁలూ యదవలోకం! బాబూ నాకు తెలీకడుగుతాను-ఇలా అల్లుళ్ళని యేటాడ్డం మన దేశంలోనే వుందా దొరల దేశంలోకూడా వుందాండీ?

కు—ఇదే ఇంగ్లండులోనో అమెరికాలోనో అయితే అలాంటివాళ్ళని కాల్చిపారేద్దురు. అక్కడ ఎవరిష్టం వాళ్ళది. ఒళ్ళు కొవ్వెక్కితే పెళ్ళాడొచ్చు, లేకపోతే నాలాగ హాయిగా యావజ్జన్మ బ్రహ్మచారిగా వుండిపోవచ్చు.

స— ఆఁ!... చూసేరా! అమెరికా అంటే స్వర్గమన్నమాట. ఎదవ ఇండియా ఎదవ ఇండియాని... పెళ్ళి తప్ప మారుమాటే లేదు. అందుకే దేవుడిలాంటి నెహ్రూగారు చచ్చిపోయారు.

మా— [విసుగ్గా] ఉత్తరం చదివి తగులడ నివ్వండిరా.

కు— (చదువుతూ) "...కట్నం నిషేధించిన సందర్భంలో పెళ్ళికూతురుపేర ఐదెకరాలమాగాణి..."

హ — ఐదెకరాలే! బ్రదర్ పెళ్ళాడెయ్యరా. ఐదెకరాలంటే పాతిక వేలరూపాయిలాస్తి. ఏటేటా వెయ్యి రూపాయిలు సిస్తు లొస్తాయి.

కు— ఏటేటా వాళ్ళావిడికి కాన్పులుకూడా వొస్తాయి. ఆస్తి చూసి పెళ్ళాడేడా వాళ్ళావిడ గంపల కొద్దీ పిల్లల్ని కని పారేసి వాడి దుంప తెంచి, చివరికి చిప్పా-దొప్పా చేతికిస్తుంది. ఇదిగో మన హనుమంతుగాణ్ణి చూడు ఎలా మారిపోయాడో. చదువుకొనేరోజుల్లో ఎప్పుడూ సూటూ, బూటూ, టై, సెంటూతోటి ప్రతీ కొత్త సినిమాకి ఫస్ట్ డే, ఫస్ట్ షో, ఫస్ట్ క్లాస్‌లో ప్రత్యక్షమయ్యేవాడుకదా! ఇప్పుడు చూడు...... రెండేళ్ళయిందట పబ్లిగ్గా సినీమా కెళ్ళి. మొన్న ఏమీ తోచక వీడింటి కెళ్ళి చదువుకోడాని కేదైనా పుస్తకం దొరుకుతుందేమోనని వెతికితే స్త్రీల వ్రతకథలూ, భక్త విజయం తప్పించి పుస్తకం లేదు.

హ— మధ్య నా గోడవెందుకురా! ఉత్తరం చదువు.

కు— (ఉత్తరంలోంచి) "పెళ్ళికూతురుపేర ఐదెకరాల మాగాణి పసుపు కుంకంనిమిత్తం రాశాట్ట..."

మా— ఇంకెక్కడి పసుపూ కుంకంరోయ్! పెళ్ళాడకపోతే నన్ను బతక నివ్వరు. పెళ్ళాడితే, నే బతకను.

కు— "...పసుపుకుంకం నిమిత్తం రాశాట్ట. శ్రావణమాసంలో మంచి ముహూర్తాలున్నాయనీ, జాతకాలు చూపెట్టి ముహూర్తం నిర్ణయించి మనకి వ్రాస్తానన్నాడు."

మా— జాతకరీత్యా పెళ్ళికూతురు కెంత త్వరగా వైధవ్యం రాసివుందో అంత దగ్గర ముహూర్తం పెట్టుకోమను.

కు— "...... మనకి వ్రాస్తానన్నాడు. నేనూ మీ అమ్మా అంగీకరించేం..."

స— ఎంత అమ్మా బాబూ అయితే మాత్రం చెట్టంత కొడుకుని, పెళ్ళిచేసి ప్రాణాలు తియ్యడం నాకేం నచ్చలేదు బాబూ.

మా— నీకు నచ్చడమేమిట్రా చచ్చు సన్నాసి. వాళ్ళకి నచ్చాలి కాని.

కు— "...అంగీకరించేం, చిరంజీవి మూల కూడా నిన్ను వరించి నిన్ను తప్ప ఎవ్వరినీ పెళ్ళాడనని శపథంపట్టి పూజలు చేస్తోందిట..."!

స— అమ్మనాతల్లోయ్! కొంప ముంచేసింది! పూజలే!

మా— ఇదేదో మంత్రాలమారిలా వుందిరోయ్! నాకు పెళ్ళి తప్పదు.

హ— పెళ్ళా, పెళ్ళంటే ఏమిటి! భూతలనరకానికిసింహద్వారం. భార్యనే తిమింగిలం, సంతానమనేమొసళ్ళూ, అత్తమామలనే జలగలూ పీక్కు తింటూంటే సమస్యల్ని తలకి చుట్టుకుని ఓపిగున్నంత వరకూ ఈసంసార సాగరంలో నిలువీత యీదడమే గృహస్థు యొక్క జీవిత కథా సంగ్రహం.

మా— ఓరి నీ కవిత్వం తగలెయ్యోయ్! ఎప్పుడో చచ్చేవాణ్ణి ముందే భయపెట్టి చంపేస్తున్నావ్రోయ్!

కు— (సీరియస్‌గా ఏదో రాస్తూ) గందరగోళం చెయ్యకండిరా. మంచి అయిడియా వొచ్చింది. ఉత్తరం రాస్తున్నా.

మా— నువ్వేం రాసినా, నా మొహాన్ని పెళ్ళిరాసివుంది. సరే కానీ పెళ్ళాడే చస్తాను.

హ— పెళ్ళాడిన తర్వాత చావడం సితరంకాదు. ఆ అమ్మాయిచూస్తే కలియుగ పతివ్రతలాగుంది. పెళ్ళికాకముందే పతిపూజ మొదలెట్టిందిట. ఒకవేళ నువ్వు చచ్చినా, సావిత్రిలాగ, యముడుతో దెబ్బ

లాడీ నిన్నుబతికించి, చావగొట్టి చెవులుమూసి నీ చేత సంసారం చేయించి తీరుతుంది.

మా— అమ్మ నాయినోయ్! నీకూ నాకూ రుణం తీరిపోయిందిరోయ్ సన్నాసీ!

స— (మార్కండేయుడి కాళ్ళు చేతులతో పెనవేసి) బాబూ!

కు— (తను రాసిన వుత్తరం చేత్తో పట్టుకుని) సైలెన్స్! డామిట్! ఏమిటీ ఏడుపులూ పెడబొబ్బలూ! ఇక్కడెవరైనా చచ్చేరేమో సనుకుంటారు.

మా— నా బతుక్కంత అదృష్టం కూడానా!

కు— షడప్! నేనురాసిన ఉత్తరం చదువుతా, శ్రద్ధగా వినండి. "శ్రీ కాంతారావుగార్కి, (అంటే మార్కండేయుడి మేనమామకి) నమస్కారములు. మీరు మీ అమ్మాయిపేర ఐదెకరాల భూమి వ్రాసియిచ్చి వైభవంగా పెళ్ళిచేయదలచుకున్నట్టు మార్కండేయుడు మాకందరికీ చెప్పేడు. పెళ్ళవగానే పదిహేను వందల రూపాయలు ఖర్చుతో ఒక పెద్ద వెట్ పార్టీ అనగా బ్రాందీ విస్కీ మొదలయిన మద్య సంబంధమైన పానీయాలతో ఏర్పాటు చేస్తాట్ట. నిన్నరాత్రి తప్ప తాగి ఒళ్ళుతెలియని మైకంలో రోడ్ మీద పడివున్న మీ మేనల్లుడు లేవదీయడానికి వెళ్ళిననాతో సినీమాలో దేవదాసులాగ నవ్వుతూ తనకి పెళ్ళాం అంటే యిష్టంలేదనీ, బ్రహ్మచర్యోపాసనే తన జీవిత పరమార్ధమనీ, మీ బలవంతంమీదే ఈ పెళ్ళి జరగబోతూంది కనక, పెళ్ళాడి మీకూ మీ అమ్మాయికీ ఓ పాఠం నేర్పుతానని అన్నాడు. ఆ మత్తులోనే వాళ్ళ తండ్రి రాసిన వుత్తరం నా చేతి కిచ్చేడు. దీనికి సాక్ష్యంగా ఆ వుత్తరం యిందులో జతపర్చి పంపుతున్నాను..."

మా— నీ వుత్తరంతగలెయ్యోయ్! ఆ వుత్తరం తీసుకెళ్ళి మా మేనమామ, మా నాన్నకి చూపెడితే!

కు— ఉత్తరం పూర్తిగా వినిచావరా! "మార్కండేయుడు వాళ్ళ తల్లితండ్రులకి ఏకైక పుత్రుడనీ, అన్ని ఆశలూ అతనిమీదే పెట్టుకున్నారనీ విన్నాను. ఈ విషయాలు తెలుస్తే వారి గుండెలు బద్దలవుతాయనీ ఆ పాపం నాకుచుట్టుకుంటుందనీ వాళ్ళకి వ్రాయలేదు. ఒక అమాయిక భారత సోదరిజీవితం సర్వనాశనం కాకుండా కాపాడదామన్న వుద్దేశ్యంతో మీకు వ్రాస్తున్నాను. ప్రతిఫలంగా మీవద్ద నుండి రెండు వాగ్దానాలు కోరుతున్నాను. ఈ రెండు వాగ్దానాలలోనూ ఏది అతిక్రమించినా, ఆయొక్క ఏడు కొండలవాడి ఆగ్రహానికి గురయ్యి మీరు సకుటుంబంగా సర్వనాశనమయ్యెదరని హెచ్చరిస్తున్నాను. మొదటిది—ఈ విషయం మార్కండేయుడి తల్లిదండ్రులకు మీరు తెలప





కుండా వుండటం. తెలిపితే జరిగే అనర్ధంతాలూకు ఉసురు మీ అమ్మాయికి తగుల్తుందని గ్రహించెదరుగాక!... ..."

మా— అదిసరే బాగుంది. మరి మా మేనమామే ఇక్కడికొస్తే!

కు— అలా గిలగిల కొట్టుకు తగులడిపోకురా, చచ్చుతొందరదొడ్డమ్మా! ఉత్తరం పూర్తిగా చదవనీ. "ఇక రెండవవిషయం. మీరు స్వయంగా ఇక్కడికివొచ్చి మార్కండేయుణ్ణి చూడటం మంచిదే. అయితే ఇక్కడికి వచ్చి స్వయంగా అతని ప్రవర్తన చూసికూడా అతని తల్లిదండ్రులకు చెప్పకపోవడం మహాపాపం. అలాక్కాకుండా చెప్పేరా, వాళ్ళు హృదయాలు పగిలి చస్తారు. అది మరీ మహా ఘోరపాపం. దీనితాలూకు ఉసురు పైదానికి రెట్టింపుంటుందని జ్ఞాపకముంచుకొనెదరుకాక!

మా— అయిపోయిందా? ఇంకా ఉందా?

కు— మాట్లాడితే ఉత్తరం చింపేస్తా.

మా— చింపేస్తే చంపేస్తా. బ్రహ్మాండంగా వుంది ఉత్తరం. చదువు.

కు— "పితృ సమానులైన మీకు వాత్సల్య పూర్వకమైన ఒక సలహా. మా అనుంగు సోదరి మాలాదేవికి వెంటనే మరో మంచి సంబంధము వెదకి పెళ్ళి చేయమని ప్రార్థిస్తున్నాను, లేనియెడల ఆమెకు బావయెడల ఉండుకుంటూవుండే ప్రేమ రానురాను వైరితలలేయుటంజేసి భగ్నప్రేమికగా జీవితం దగ్ధమొనర్చుకొనుట తథ్యం. ఇంత అర్ధాంతరముగా మరో సంబంధం చూసుకోవలసిన అగత్యమేమొచ్చెనని మార్కండేయుడి తల్లి తండ్రులు మిమ్ములను నిలదీసి యడిగినచో వారి ఉభయ జాతకముల పరీక్ష రీత్యా గ్రహబల దృష్ట్యా పెండ్లికొమారైకు అనతికాలములోనే వైధవ్యం పొడసూపుచున్నట్లు విజ్ఞులు శలవిచ్చినట్టు వారికి వర్తమాన మంపగలరు. నిజమునకు ఇంతకంటే పదునైన కారణములు కూడ తమవంటి అనుభవజ్ఞుల కల్పనాశక్తి కతీతములు కావు. భవత్ శ్రేయోభిలాషి." ఎలాగుంది మన పథకం! 'కన్యాశుల్కం' స్టైయిల్లో వేశాను. దీనికింక తిరుగులేదు.

హ— బ్రదర్ నీ బుర్ర అమోఘంరా. నువ్వు చచ్చేక నీ మెదడు సైంటిస్టులు పరిక్షచెయ్యడం దేశానికెంతో అవసరం.

స— చచ్చేవరకూ ఎందుకు బాబూ! ఈలోగానే అలాంటి ఏర్పాటు చేయిస్తేసరి.

మా— మొత్తంమీద ప్రస్తుతానికి నా గండం గడిపించేవు. నా బ్రహ్మచర్యం నిలబెట్టేవు.

స — మా అయ్యగారి బ్రెహ్మ చర్యానికి జై! బ్రెహ్మచర్యానికి ...

హ —

కు — జై!

మా —

◆ ◆ ◆



## 3 వ రంగం

[మార్కండేయుడు, సంధ్యా చెరోవైపునుంచీ ప్రవేశిస్తారు. రంగ స్థలంరోడ్డు. ఒకళ్ల నొకళ్ళు చూసి కూడా చూడనట్టు నటిస్తూ మౌనంగా ఎవళ్ళ దారిన వాళ్ళు వెడుతూ వుంటారు. సంధ్య అతనికి కనబడే లాగా చేతులో రుమాలు కిందకి జారవిడుస్తుంది]

మా — (తడబడుతూ) న ... నమ స్కారం!

సం — (వెనక్కి తిరిగి) ఓ! మిస్టర్ మార్కండేయ్! గుడ్ మార్నింగ్.

మా — గుడ్ మార్నింగండీ .... మీ చేతిరుమాలు ... ...

సం — నా చేతిరుమాలేమి టండీ, అవసరమైతే నాప్రాణాలుకూడా మీ కిచ్చేస్తాను. మీలాంటి కాలేజీ స్పోర్ట్సు ఛాంపియన్ అడగాలేకాని ఏదివ్వకుండా వుండగలం! (తడుము కుని) అరె! కనబడ లేదే!

మా — అబ్బెబ్బె! అలాంటిదేం కాదండి. మీచేతి రుమ్మాలు కింద పడింది. అది చూపెడదామని.

సం — ఓహ్! మైగాడ్! ఎప్పుడు పడిపోయిందీ!

మా — ఇప్పుడే ఇక్కడే, ఇదిగో.

సం — థేంక్యూ మిస్టర్ మార్కండేయ్! ఏదీ (చేతి కందివ్వమన్నట్టు చెయ్యి జాపుతుంది).

మా — (తటపటాయించి, రుమాలు వైపు చూపెడుతూ) ఇదిగో వండి. ఇక్కడేవుంది ... తీసుకోండి.

సం — అదిగో మీకాళ్ళదగ్గరే వుంది. ఇలా యివ్వండి.

మా — (తప్పని సరైనట్టుగా, తన చేతికి తగలకుండా జేబులోంచి పెన్ తీసి దాని సహాయంతో రుమాలు తీసి అందిస్తూ) ఇదిగోనండి. మళ్ళీ పారేసు కోకండి.

సం — (పెన్ లాక్కుని, రుమ్మాలు మార్కండేయుడి మీదకి గిరవాటే డుతూ) అది మీ దగ్గిరుంచండి. ఇది నా దగ్గిరుంటుంది.



మా — అహఁ హఁ! వొద్దండీ, కావలిస్తే యిదికూడా మీ దగ్గిరే వుంచుకోండి. నా దగ్గిర చాలా రుమాళ్ళున్నాయి.

సం — ఎంత మాట! మీ దగ్గిర జేబురుమాళ్ళుండవనా! చూశారూ, ఇవ్వాళ నాకు మీరెదురవ్వటం, ఎప్పుడూ జాగర్తగా వుండే నాకు మైమరపు రావడం, రుమాలు కింద పడటం, అది మీరు చూడటం, పెన్‌తోసహా నాకివ్వడం ... ఇదంతా దైవికంగా జరిగింది. భగవంతుడు ఏదో ఓ మహత్తరమైన లక్ష్యంతో ఈ సంఘటనని కల్పించి వుంటాడు. అంచేత ఈ సంఘటనకు స్మృతి చిహ్నంగా మీరు నాకు ప్రేమతో పార్కర్ పెన్ బహూకరించినట్టు గానే ఈ స్వల్పమైన బహుమానాన్ని నా దగ్గర్నుంచి మీరు కూడా, తీసు కోవాలి.

మా — పెన్ నేను అలాంటి వుద్దేశంతో ...

సం — నాకు తెలుసు. మీశరీరం ఎంత గట్టిదో మీ హృదయం అంత మెత్తటిది. ఇది కేవలం నా సంతో షంతో యిస్తున్నది.

మా — (అటూ యిటూ చూసి రుమాలు జేబులోకి తోసుకుంటూ ఖంగారుగా) నే వెళ్ళొస్తానండి.

సం — మీ వేళాకోళాని కేం గాని, రండి అలా పార్క్ కేసి వెడదాం. నిజానికి మీరింత సరదా అయిన మనుషు లనుకోలేదు.

మా — మీరెళ్ళండి. నాకు వేరే పనుంది.

సం — చాల్లెండి, సరసాలు. ఇలాంటి మధురఘడియల్లో మనిద్దరం పార్కు కెళ్ళటంకంటే మంచి పనే ముంటుంది! (చెయ్యందుకుని) రండి వెడదాం.

మా — [తేలుకుట్టినట్టు చెయ్యి వొదిలించుకుని] అమ్మబాబోయ్! నేను మీతో వంటరిగా పార్కుకు రావడం కుదరదండి.

సం — వంటరిగా ఏమిటండీ! జంటగా మనిద్దరం వెడదాం. సర్దాగా మాట్లాడుకుందాం.

మా — ఇంతవరకూ మాట్లాడు కున్నది చాలండీ. మరోసారి వెడ దాం. లేకపోతే మీరు వెళ్ళండి. నేను తర్వాత వస్తాను.

సం — (తీక్షణంగా) ఏమిటీ! మీరు నిజంగానే రానంటున్నారా!

మా — అవునండీ! నాకు పనుంది.

సం — (స్వరం హెచ్చించి) హుఁ ... రమ్మనడం నాదే తెలివితక్కువ. భారతదేశం అనాదిగా ధైర్య, శౌర్య పరాక్రమవంతులకి పుట్టిల్లు. నీ ఒడ్డూ పొడుగూ చూసి, తోటి కాలేజీ విద్యార్థివనీ, రక్షిస్తావనీ అనుకు న్నాను. ఆపదలోవున్న స్త్రీకి సహా యం చెయ్యడానికి నిరాకరించే కిరా తకుడ వనుకోలేదు.

మా — (విస్తుపోయి) ప్లీజ్! కొంచెం నెమ్మదిగా మాట్లాడండి.

మీకొచ్చిన ఆపదేమిటి? నా సహాయమేమిటి? నాకేం అర్థం కావడం లేదు.

సం— హృదయం వుంటేకదా అర్థమవ్వడానికి. నడిరోడ్డుమీద నిలబెట్టి ఒక ఆడదాన్ని పట్టుకు యిలా అవమానిస్తారా?

మా— (దీనంగా) చూడండి. మీరలా ఆవేశంలో మాట్లాడుతుంటే, వంటరిగా చూసి మిమ్మల్ని ఏ బలాత్కారమో చేసేననుకుని అందరూ నన్ను పట్టుకుంటారు.

సం— (గట్టిగా) అయితే అన్ని అవమానాలూ, అన్ని అపదలూ నాకే కాని మీ మీద ఈగయినా వాలకూడదన్నమాట!

మా— (బతిమాల్తూ) ఏమండీ! ఏమండీ! నెమ్మదిగా మాట్లాడండి. అసలు మీకొచ్చిన ఆపదేమిటో చెప్పండి.

సం— నన్ను రక్షిస్తానని మాటయిస్తారా?

మా— చచ్చినట్టు... ఐమీన్... తప్పకుండా.

సం— అదికాదండి. "ఏ" అనే అందమైన బుద్ధిమంతురాలయిన ఓ అమ్మాయి "బి" అనే అందమైన మంచి అబ్బాయిని ప్రాణప్రదంగా ప్రేమించిందనుకోండి. అలాంటప్పుడు "సి" అనే దుర్మార్గుడైన అబ్బాయొచ్చి ఆ "బి" అనే అబ్బాయిని నానాతిట్లూ తిట్టి "ఏ" అనే అమ్మాయిని బలవంతం చేస్తే అప్పుడు "బి" అన్నవాడు "సి" అన్నవాణ్ణి ఏం చెయ్యాలంటారు?

మా— చూడండి. నాకు తల తిరుగుతోంది. రెండ్రోజులయింది తిండితిని. డాక్టరుదగ్గిరికి వెళ్ళాలి. దయుంచి నన్ను పోనీండి.

సం— (అనునయంగా) ఏమండీ! కొన్నాళ్ళు మీరా తాగుడూ జూదం మానెయ్యండి.

మా— తాగుడూ జూదమూనా! దైవసాక్షిగా అవంటే ఏమిటో నాకు తెలియవండి. నాకు కొంచెం గుండె దడగావుంది. నే వెళ్తా. శలవు!

సం— (గట్టిగా) ఇలా నా జీవితం సర్వనాశనంచేసి, సంఘంలో నవ్వుల పాలు చేద్దామని... ...

మా— అమ్మనాయినోయ్! అంత గట్టిగా కేకలేస్తూ మాట్లాడకండి.

సం— అయితే నే నడిగినదానికి సమాధానం చెప్పండి. అలాంటప్పుడు "బి" అన్నవాడు "సి" అన్నవాణ్ణి ఏం చెయ్యాలి?

మా— మీరేం చెయ్యాలంటారు?

సం— చీల్చి చెండాడాలంటాను.

మా— కరెక్ట్! డొక్కచీల్చి డోలు వాయించాలి. మరి నాకు శలవా!

సం— అయితే మీరు కుటుంబ్రావ్ డొక్కచీల్చి నన్ను రక్షించాలి.

మా— కుటుంబ్రావునా!



సం— అవును. అతనేకదా మిమ్మల్నిగురించి, మీరు తాగుబోతనీ, అన్ని వ్యసనాలకీ అలవాటుపడ్డారనీ ఊరంతా టాంటాం చేస్తున్నాడు. "అదేమిటండీ అలాంటి మహానుభావుడిమీద ఇలాంటి అభాండాలు వేస్తున్నారూ? ఆయన మంచితనాన్ని గురించి ఎరగని కాలేజ్ గర్ల్‌వుందా!" అని నేను ఆ మధ్య రోడ్డుమీద నిలబెట్టి అడుగుతే "ఆ రాక్షసుణ్ణిగురించి ముందుముందు మీకే తెలుస్తుంది" అంటూ మిమ్మల్నిగురించి ఎన్ని దుర్మార్గపుకూతలు కూసేడనుకున్నారూ!

మా— మైగాడ్! నిజంగానా?

సం— పనిగట్టుకొచ్చి మీతో అబద్ధమాడతానా! అదంతా నిజమనుకుని నమ్మి మా గరల్సందరూ "దేముడులాంటి మార్కండేయులుగారు ఇలా మారిపోయారేమిటా!" అని ఒకటే కంట తడిపెట్టడం!

మా— మీరెలా నమ్మారండీ!

సం— నమ్మక ఏంచెయ్యమంటారు! రోజూ ఆకుటుంబ్రావు నన్ను వెంటాడుతూ ఇదే గొడవ.

మా— కుటుంబ్రావ్ మిమ్మల్ని వెంటాడుతున్నాడా!

సం— నేనో అబ్బాయిని ప్రేమించేననుకోండి. పని కట్టుకుని వెంటబడి ఆఅబ్బాయికి ఆడదంటే భయం, పెళ్ళంటే వొణుకూ, ప్రేమంటే ఒడుసుకుంటాడూ, చిన్న చిన్న ఆడపిల్లలు వంటరిగా కనబడితే పీక నులిమేస్తాడూ, పచ్చితాగుబోతూ, అంటూ ఒకటే సొద!

మా— ఏడవ లేకపోయాడు. అసలు వాడో పెద్ద బ్రహ్మచారినని అఘోరిస్తాడుగా!

సం— ఆ... ఏమిటో మీ పిచ్చి. అందరికీ మాటల్లోనే బ్రహ్మచర్యం. మాటవరసకి చెబుతా. మీరే వున్నారండీ, మంచి బుద్ధిమంతురాలయిన అమ్మాయి, మంచి అందంగా వుండి, భర్తే దైవం అనుకుంటూ మిమ్మల్ని పెళ్ళాడుతుందనుకోండి...

మా— నా గొడవెందుకు లెండి!

సం— అదేం మాటండీ! మీకేం లోటు! మంచి రూపం, చదువూ సంస్కారం, సంపదా, సద్గుణాలూ...

మా— (సిగ్గు అభినయిస్తూ) అవుననుకోండి. అయినా అంత మంచి ఆడాళ్ళుం డొద్దండీ!

సం— అదేం మాటండీ! నేను మంచిదాన్ని కాదా? అందంగా వుండనా?

మా— మీరా! ఓయస్! వెరీ బ్యూటిఫుల్!

సం— నాకు చదువుంది, సంస్కారముంది. ఏమంటారు.

మా— అవునండి ... అవును. అన్నీ వున్నాయి.

సం— అలాంటి నేను 'ఏ' అనే అబ్బాయిని ప్రేమిస్తుంటే, మధ్య ఈ

కుటుంబ్రావెవడండీ పానకంలో పుడకలాగ!

మా— (నిరుత్సాహంగా) అసలు ఆ 'ఏ' ఎవరండీ?

సం— మీ ఎదురుగుండా చెప్పడానికి సిగ్గుగా వుందండీ.

మా— (బిక్క మొహం వేసి) పర్వాలేదు చెప్పండి.

సం— వేనిటీ బేగ్ కేసి చూపెడుతూ) ఎప్పుడూ ఆయన ఫొటో నాదగ్గరే వుంచుకుంటాను.

మా— ఏదీ ఆ ఫొటో యిలా చూపెట్టండి.

సం— నాకు సిగ్గేస్తోందండీ! ఎంతయినా ఆడదాన్నికదా! ఇంతకీ మీ హృదయం తెలుసుకోనివ్వండి. లేకపోతే నా జీవితమంతా నవ్వులపాలవుతుంది.

మా— అయితే ఏం కావాలో అడగండి.

సం— అడగడానికేముందండీ! మీరోసారి ఆ కుటుంబ్రావుగార్ని కలుసుకుని నన్ను వెంటాడొద్దనీ, నాదార్ని నన్ను వదిలెయ్యమనీ గట్టిగా చెప్పండి. ఈ విషయం చెప్పడానికే మిమ్మల్ని పార్కుకు రమ్మన్నాను.

మా— దానికేంలెండి. ఇవ్వాళే వెళ్ళి వాణ్ణి దులిపేస్తాను. మీరేం భయపడకండి. మీ యిష్టమొచ్చిన వాణ్ణి మీరు ప్రేమించుకుంటుంటే, రాస్కెల్! మధ్య వాడి అడ్డేమిటి.

సం— మిమ్మల్నే నమ్ముకున్నాను. మరిమీరేం చేస్తారో!... ఇందాకా తొందరపడి మిమ్మల్నేమిటేమిటో అన్నాను. క్షమించాలి.

మా— ఆ మాటకొస్తే మీరే క్షమించాలి.

సం— ఈనాడు నాహృదయం ఆనంద పరవశమయింది. వస్తా. శలవు,

మా— వెడతారా! పదండి అలా పార్క్ వరకూ దిగపెట్టొస్తాను.

సం— ఇంకెందుకులెండి. మరోసారి వెడదాం. శలవు.

[సంధ్య వెళ్ళిపోగానే మార్కండేయుడు తన ఛాతీ ఒక్కసారి పూరించి చేతుల దండలు చరుచుకుని ముసిముసి నవ్వులతో నిష్క్రమిస్తాడు. అదేసీను. మార్కండేయుడు నిష్క్రమించగానే మరో వైపునుంచి సంధ్యా కుటుంబరావు ప్రవేశిస్తారు. కుటుంబరావు మొహంలో గాంభీర్యం, నిరసన వ్యక్తమవుతూ వుంటాయి. సంధ్య ప్రాధేయపూర్వకంగా కుటుంబరావుని అనుసరిస్తుంది.]

కు— మిస్ సంధ్యా! ఇలా నడిరోడ్‌మీద నిలబెట్టి మాట్లాడటం నాకిష్టంలేదు.

సం— నాకుమాత్రం యిష్టంగుండీ!... పోనీ అలా పార్క్ కేసి పోయి... ...

కు— శ్కాండలస్! నేనేమిటి! మీకూడా ఏమిటి! పార్క్ కేమిటి! రావడమేమిటి! ఏమిటి దంతా! నేను ఘోటకబ్రహ్మచారిని. ఆడదంటేనాకు పరమ అసహ్యం.

సం— నాకు మొగాడంటే మరింత అసహ్యం. సరిగ్గా మనవిద్దరివీ ఒకే మాదిరి హృదయాలు. అందుకే మీ సహాయంకోసం వచ్చాను.

కు— ఏమిటా సహాయం?

సం— రోడ్‌మీద ఒంటరిగా ఆడది కనబడిందికదా అని నోటికొచ్చినట్లల్లా కూసిన మొగాణ్ణేం చెయ్యాలంటారు?

కు— దండలేసి ఊరేగించాలంటాను! సంగతేమిటో చెప్పమంటే యీ కట్టుకథ లన్నీ ఎందుకూ?

సం— (దీనంగా) అవునేండి. మీ రాయనకి గురువేగా! మీరే నేర్పుంటారీ విద్యలన్నీ.

కు— వాడెవడు! ఏమిటీగొడవ? నాకు చాలా అర్జెంట్ పనుంది. మీకు త్వరగా చెప్పడం రాకపోతే కాయితంమీద రాసి పోస్ట్ చెయ్యండి. ఇదిగో నా ఎడ్రస్ (విజిటింగ్ కార్డు యిస్తాడు).

సం— ఏమీతెలియనట్టు మాట్లాడుతారే! ఆ మార్కండేయులు మీ శిష్యపరమాణువేగా! పైకిమాత్రం బ్రహ్మచారిని బ్రహ్మచారిని అంటూ [illegible] కాయించడం. దార్లో వంటరిగా [illegible] కనబడితే ప్రేమా పెళ్ళీ [illegible] వెంటబడటమూనా!

కు— మార్కండేయుడా! మీకేమైనా మతిపోయిందా!

సం— నాకేంగాని అతనికి మతిపోయుంటుంది. (సాలోచనగా) అవునండోయ్! అతనికి పిచ్చెత్తి వుంటుంది. లేకపోతే నిన్న మొన్నటి వరకూ ఆడపిల్లలంటేనే హడిలి చచ్చేవాడు. ఇందాక అలా నా వెంటపడి తరమడం, పైగా మిమ్మల్ని వెధవా, బోడీ అని నానామాటలూ అనడం... అవును. అవన్నీ పిచ్చిలక్షణాలే!

కు— ఆఁ!...నన్ను తిట్టేడా?

సం— అవన్నీ ఇంకెందుకులెండి! మీ రన్నట్టు అతనికి పిచ్చెత్తి వుంటుంది. మీ కనవసరంగా శ్రమ కలిగించి విసిగించేను. క్షమించండి. శలవు!

కు—ఉండండి. అసలు ఏం జరిగిందీ?

సం— అవన్నీ నేను కాగితంలో రాసి పంపిస్తాను.

కు— నాపని ఎలాగా పాడయ్యింది. సంగతేమిటో చెప్పండి.

సం— నాకు త్వరగా చెప్పడం రాదండీ.

కు— గుడ్ గ్రేషస్! సరే సావకాశంగానే చెప్పండి.

సం— ఇందాకా యిక్కడే యీ రోడ్ మీదే ఆయనలా వొస్తున్నాడు. నేనిలా ఎదురుగా వెడుతు తున్నాను. ఎవళ్ళదార్ని వాళ్ళు పోతున్నా మనుకుంటే, అదేం

పొయ్యేకాలమో చటుక్కున రోడ్‌కి అడ్డంతిరిగి ధన్నుమని యిలా నన్ను ఢీకొట్టేడండీ. (అంటూ కుటుంబరావుని ఢీకొడుతుంది.) ఇదేమయినా బాగుందాండీ!

కు— చాలా బాగుందండి.

సం— (కోపంగా) బాగుందా!

కు— ఐ మీన్! మార్కండేయుడు డేష్ కొట్టటం మాట కదూ! ఏడిసినట్టుంది. రాస్కెల్! ఎన్ని వేలగుండెలున్నయ్! ఎంత మదం!

సం— అప్పుడు నే నాయనతో అన్నాను... "ఏమండీ ఇదేం ధర్మం కాదు. నేను అబలని, నిస్సహాయురాల్ని. మీ రందమైన వాళ్ళే కావచ్చు..."

కు— వాడి బొంద. అందం! బకాసురుడు! వాడి అందాన్నే మెచ్చుకోవాలి! రౌడీ వెధవ! బ్రహ్మచర్యంట! వాడి శార్ధం! ఊఁ... ఇంకా ఏమన్నారూ?

సం— "మీ రందమైన వాళ్ళే కావచ్చు, ధైర్యమయిన వాళ్ళే కావచ్చు—"

కు— ఎవడు! వాడా ధైర్యవంతుడు! రెండు సార్లు పెళ్ళంటే హడలి ఆత్మహత్య చేసుకోబోతుంటే... రక్షించేను. పిరికి వెధవ... ఊఁ...

సం— "అందమైన వాళ్ళే కావచ్చు' ధైర్యమయిన వాళ్ళే కావచ్చు, పెద్ద రొమాంటిక్ హీరోయే కావచ్చు..."

కు— రొమాంటిక్ హీరో! గుడ్ హెవెన్స్! ఫుట్‌బాలూ, లాంగ్ జంపూ హైజంపుల్లో హీరో. రొమాన్స్‌లో మాత్రం జీరో. వాడికి రొమాన్సేమిటీ; నాన్‌సెన్స్! తర్వాత ఏమన్నారూ?

సం— "తప్పండీ... అలా చెయ్యకూడదు" అన్నానండి.

కు— ఇంకా అనడమేమిటండి! లాగి లెంపకాయ కొట్టాలికాని!

స— ఏమిటో ఆయన మొహం చూస్తే కొట్టబుద్ధవ్వలేదండీ. అమాయికుడిలాగుంటాడు.

కు— వాడా అమాయికుడు! కాలాంతకుడు! శుద్ధ కరోడా! కన్న తల్లిదండ్రులు కంటికీ మంటికీ ఏకధాటిగా కన్నీరు కారుస్తూ బంగారంలాంటి మేనరికంవుంది చేసుకోరా అని బతిమాత్తే ఆజన్మబ్రహ్మచారిగా వుండిపోతానంటూ వెధవ రాతలురాసిన కిరాతకుడు.

సం— నాతో ఎన్ని అబద్ధాలాడేరనుకున్నారూ! ఆకాశరామన్న ఉత్తరం రాసి మీరే ఆయన పెళ్ళి చెడగొట్టేరుట.

కు— ఓరి వీడి నాలిక తెగెయ్యా!

సం— మీరో పెద్ద బ్రహ్మచర్యోపాసకులనీ, మీ సహవాసం





వల్లనే పాడైపోయాననీ అన్నాడండాయన.

కు— మాటిమాటికీ 'ఆయన ఆయన' అంటూ ఆ శ్యాంప్‌ను మన్నిస్తారెందుకూ. వాడనండి చాలు. ఇంతకీ వాడిదగ్గర నా ప్రసక్తి ఎందుకొచ్చింది!

సం— అది చెప్పడానికే సిగ్గేస్తోందండి.

కు— ఛ! సిగ్గెందుకూ! నే నేం పరాయివాణ్ణా! చెప్పండి.

సం— మీరు మాటిమాటికీ 'అండి అండి' అంటుంటే పరాయివాళ్ళు కాకపోతే దగ్గర వాళ్ళవుతారా!

కు— ఓ! అదా—చెప్పు!

సం— ఆయన అన్నాడూ "సంధ్యా నిన్ను నేను ప్రేమించాను..."

కు— ఏమిటీ! సంధ్యా అని పిలిచేడేం! పరస్త్రీని నడిరోడ్డుమీద పేరెట్టి పిలుస్తాడా! స్కౌండ్రల్!

సం— "సంధ్యా నిన్ను నేను ప్రేమించాను. పెళ్ళిచేసుకుంటాను. లేకపోతే నేను బతకలేను." అంటూ చెయ్యి పట్టుకుని ఒకటే లాగడం!

కు— ఆఁ...... చెయ్యి పట్టుకున్నాడా! ఎంత బరితెగించేడూ! చూడు సంధ్యా ఇంకమీదట వాడు కనపడ్డా పలకరించినా వాడికేసయినా చూడొద్దు. వాడి ధోరణి వింటుంటే పిచ్చెమోనని అనుమానంగా వుంది... ఇవ్వాళ చెయ్యి పట్టుకున్నాడు. రేపు కరుస్తాడు. అయినా చెయ్యెందుకు పట్టుకోనిచ్చేవు?

సం— నేను పట్టుకోనివ్వడమేమిటండీ! మంచివారే! మీదగ్గిర ఇంత చనువుగా వున్నానని ఆయనదగ్గిరా వుంటాననుకున్నారా ఏమిటి!

కు— అబ్బెబ్బె! నీ సంగతినాకు తెలీదూ! మన స్నేహం మన ప్రేమానురాగాలూ వేరు. ఇంకేమన్నాడూ?

సం— "నన్ను పెళ్ళాడటానికి నీ కభ్యంతరం ఏమిటి? అందం తక్కువా? చదువు తక్కువా? ఐశ్వర్యం తక్కువా?" అని ఒకటే నిర్బంధం.

కు— ఓరి వీడి ప్రణయ సాహిత్యం పాతెయ్యా! వీడో శుద్ధ 'సింపుల్టన్' అనుకున్నానిన్నాళ్ళూ. అప్పుడు నువ్వేమన్నావు?

సం— "మీరలా బలవంతం చెయ్యడం తప్పు. నన్నాలోచించుకోనివ్వండి. నాకు ప్రేమ ముఖ్యం. ఇక చదువు అందం ఆస్తీ అన్నారా. మీ కంటె అన్నింటిలోనూ మించిన వాళ్ళెంతమందో వున్నారు. ఆమాట కొస్తే... (సిగ్గుపడుతూ ఆగిపోతుంది)

కు— ఊఁ... ఆమాటకొస్తే.

సం— మీపేరు చెప్పేనండి.

కు— భేషయినపని చేశావు.



కుక్క కాటుకు చెప్పు దెబ్బన్నట్టు బుద్ధొచ్చీలా సమాధానం చెప్పేవు.

సం— దాంతోటి రెచ్చిపోయి మిమ్మల్ని "అల్ఫాబెటికల్ ఆర్డర్"లో "ఏస్స్, బ్రూట్, క్రూక్, డన్స్" అంటూ ఒకటే తిట్లు. (కళ్ళుతుడుచుకుంటూ) వినలేక పోయాను.

కు— విచారించకు.

సం— నన్ను గురించికాదండి విచారం... మిమ్మల్నలా నోటి కొచ్చినట్లు... ...

కు— తిడతాడు. తిడతాడు. తిట్టడూ. వాడికి రోజులు దగ్గర పడ్డాయి. రేపే వాళ్ళ మేనమామకి ఉత్తరం రాస్తా.

సం— వాళ్ళ మేనమామేం చేస్తాడండీ!

కు— చావగొట్టి చెవులుమూసి పెళ్ళిచేస్తాడు. దాంతో వాడిరోగం చప్పగా కుదురుతుంది.

సం— (దెబ్బతిన్న ధోరణిలో) ఆఁ!... పెళ్ళాడితే రోగం కుదురుతుందా! అయితే ఆయన చెప్పినట్టు మీరు నిజంగా బ్రహ్మచర్యోపాసకులే నన్నమాట! దేవుడిలాంటి మార్కండేయులుగార్ననుమానించాను. వెళ్ళి ఆయన కాళ్ళమీదపడి క్షమాపణ చెప్పుకుంటాను. (వెళ్ళిపోబోతుంది.)

కు— ఆఁ ఆఁ ఆఁ!... (చెయ్యి పట్టుకు లాగి)ఏమిటా తొందర; నన్ను సమాధానం చెప్పనియ్యి. ఒకప్పుడు బ్రహ్మచారిగా వుండిపోటానికి నిర్ణయించుకున్నమాట నిజమే. కాని, నిన్నుచూసిన క్షణంలో ఆ నిర్ణయం పటాపంచలైపోయింది.

సం— ఏమో బాబూ! నాకు భయంగా వుంది. అసలు మీతో ఇంతసేవు మాట్లాడదామనుకోలేదు. నాకు తెలియకుండానే నేను నా హృదయంవిప్పి మీతో చెప్పేశాను.

కు— అదే ప్రేమంటే. మొదట్లో కొంచెం భయం భయంగానే వుంటుంది. రాను రాను అదే మన హృదయాల్లో అమృతవర్షం కురిపిస్తుంది.

సం— నా కేమిటో కొత్తగా వుంది. మీ కేమిటో చాలా అనుభవం వున్నట్టుంది. (చెయ్యి విదిలించుకుని) మార్కండేయుడి మేనమామకి ఉత్తరం పత్రం వొద్దుకాని, ఓ సారి ముఖాముఖీన కల్సుకుని చివాట్లు పెట్టండి. నే వస్తా.

కు— సంధ్యా! సంధ్యా!

(వెంబడిస్తాడు.)

♦ ♦ ♦



## 4 వ రంగము

[హనుమంతరావు యింట్లో సావిడి. రెండు మూడు కుర్చీలు ఓ టీ పాయి వుంటాయి. హనుమంతరావు సావకాశంగా సిగరెట్టు కాల్చుకుంటూ పేపరు చూస్తూవుంటాడు. చేతులో కూరగాయల సంచీతో సన్యాసి ప్రవేశిస్తాడు.]

స— నమస్కారం సార్.

హ— ఏరోయి సన్యాసీ! ఏవిటి విశేషాలు. చేతులో ఈ కూరగాయల సంచీ ఏమిటి! మార్కండేయుడి మఠంలో వంటా గింటా కూడా పెట్టేవా యేమిటి!

స— చ ఛ! ఆయనక్కాదు బాబూ, మాయింటికి. నెల్లాళ్ళయింది సార్ పెళ్ళిచేసుకున్నానండీ.

హ— పెళ్ళా! మైగాడ్. అయితే సన్యాసి సంసార య్యేడన్నమాట. వెనక మార్కండేయుడి పీకల మీదికి పెళ్ళొచ్చి నప్పుడు పెళ్ళొద్దని నెత్తి మొత్తుకున్నావు కదరా!

స— అవునను కోండి. కాని ఎన్నాళ్ళీ ఒటేలు మెతుకులు తిన మంటారు సార్! అదీకాక నావయస్సోళ్ళందరూ పెళ్ళాడి మొగుళ్ళూ పెళ్ళాలూ చెట్టా పట్టా లేసుకుని సినీమాల్లోలాగా సిలకా గోరింకలాగ నాకళ్ళ ముందే తిరుగుతుంటే ఏటయితే అయిందని పెళ్ళాడేసేను బాబూ.

హ— ఓరి చవటా! నీతప్పేముందిలే. ప్రపంచంలో ప్రతీ మొగాడూ పడ్డగోతిలోనే నువ్వూ పడ్డావు. కానుకే అనుకుంటావో కనికరమే అనుకుంటావో యిందఈ పదిరూపాయలు తీసుకో.

స— కట్టంతెలిసిన మారాజులు. మాయావిడి పదిరోజుల్నుంచి సెర్లిన్ రయిక గుడ్డతెమ్మని పోరెడుతోంది. ఇప్పుడే అది కూడా కొనుక్కుపోతా.

హ— సెభాష్! అయితే రక్తి కట్టిందన్నమాట నీసంసారం. ఏమిటి ఇలా కొట్టుకొచ్చేవు?

స— నామొహం. సంతకెళ్ళా! మాయావిడి ఊసులోపడి అసలు పని మరిచిపోయాను. మా బాబు గారిక్కడి కొస్తానని చెప్పమన్నారండి.

హ— (మార్కండేయుడు రావడం చూసి) పాపీచిరాయుః అన్నారు. నీకు నూరేళ్ళాయుష్షు. నీ మాటే అనుకుంటున్నాం.

మా— ఇల్లేమిటి యింత నిశ్శబ్దంగా వుంది! మీ ఆవిడినీ పిల్లల్నీ పుట్టింటికి తోలేసేవా!

హ— అంతదృష్టంలేదు బ్రదర్. మాఆవిడ తాలూకు చుట్టాలెవరో దిగేరు. మొగాడేమో మా పిల్లల్ని తీసుకు షికారు పోయాట్ట. ఆడాళ్ళేమో మా అవిడతో వంటింట్లో బాతాఖానీ కొడుతున్నారు.

మా— నీతో ఓ ముఖ్యమయిన

విషయం మాట్లాడ్డానికొచ్చేను.

హా— మాట్లాడు.

మా— నేను పెళ్ళాడ్డానికి నిశ్చయించుకున్నాను.

హా— పెళ్ళా!

మా— జీవితానికో అర్థం పరమావధి అవసరం. జీవితంలో ఓ బాధ్యతగల వ్యక్తిగా జీవించాలంటే సమాజంయొక్క కట్టుబాట్లు గౌరవించడం మన ధర్మం. ప్రపంచ జనాభాలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ. నాలాంటి మొగాళ్ళందరూ బ్రహ్మచారులుగా వుండిపోతే ఆ స్త్రీల జీవితాలేమయిపోవాలి!

హా— వాళ్ళని కూడా బ్రహ్మచారిణిలుగా వుండమని బోధిద్దాం.

మా— ఈ విషయంలో నీబోడి సలహా అనవసరం. బ్రహ్మచర్యం స్వార్థ జీవితానికి దారితీస్తుంది. గృహస్థాశ్రమం వేదోక్తమయిన మానవ ధర్మం. ఈలక్ష్యంతోటే భగవంతుడు మానవుల్ని స్త్రీపురుషులుగా విభజించేడు.

హా— ఓరి నీవేదాంతం తగలెయ్యోయ్! మీనాన్న దగ్గిర్నుంచి మళ్ళీ వుత్తరం వచ్చిందా ఏమిట్రా.

మా— డోంట్ బీ సిల్లీ!

హా—మీ మేనమామ కట్నం రేటు పెంచితే నువ్వు ప్లేటు మారుస్తున్నావా!

మా— అసలా సంబంధమే కాదురా. సంధ్యని పెళ్ళాడదామనుకుంటున్నా.

హా— ఎవరూ! సంధ్యా! ఆ పి. యు. సి. చదువుతున్న అమ్మాయి. ఆ గరల్స్ హాస్టల్ సెక్రటరీ!

మా— అవును ఆ అమ్మాయి నేనూ ప్రేమించుకున్నాం.

హా— వెళ్ళి వెళ్ళి పెద్ద పాము నోట్లో పడ్డావేమిట్రా!

మా—ఒరేయ్! నీ చవటశకునపక్షి ప్రసంగం నాతో కట్టిపెట్టి, ఆ కుటుంబరావుగాణ్ణి ఒళ్ళు దగ్గిరపెట్టుకుని ప్రేమా పెళ్ళీ అంటూ పిచ్చి పిచ్చి వేషా లెయ్యొద్దని సలహా చెప్పు. ఇప్పుడు వాడిక్కడికొస్తాడుగా! వాణ్ణికూడా రమ్మని కబురంపించేవుట.

హా— నేను రమ్మనడమేమిటి?

మా— మీ పిల్లల్నిద్దర్నీ తీసుకుని, మీ చుట్టంట ఎవడో, తీరుబడి చేసుకుని మిమ్మల్నీ కుటుంబరావుగార్నీ ఓ సారి అర్జెంటుగా హనుమంతరావుగారు రమ్మన్నారండని చెప్పి పోయేడు.

హా— ఈ కొత్తచుట్ట మెవడో నాకూ తెలీదు. రానీ పిలక జాడిస్తా.

మా—పోనీగాని, వెంటనే కుటుంబరావుకు బుద్ధి చెప్పాలి.

హా— ఊళ్ళో కలరావుందని విన్నాను. కాని, ఇంత ప్రబలమైన ప్రేమజ్వరం వ్యాపిస్తుందని వినలేదే!





కు— (ప్రవేశిస్తూ) ఏమిట్రోయ్! ఏదో వినలేదంటున్నావు. ఈరోజుల్లో కనీ వినీ ఎరుగని చిత్రాలెన్నో జరుగుతున్నాయి. (మార్కండేయుడికేసి తిరిగి) ఇదుగో! మన "ట్వెంటియత్ సెంచరీ రోమియో" యిక్కడే వున్నాడు.

మా— నీ వ్యాధి ఇంత ముదిరిందని తెలియదు. లేకపోతే యీపాటికే మందిచ్చేవాణ్ణి.

కు— ఆ మందేదో నువ్వు వాడి చూడు. నీ రోగం అప్పుడే సంధిలోకి దిగింది.

హా— మీ యిద్దర్నీ కట్టకట్టి తగలెయ్య! మీ రిద్దరూ ఓ అమ్మాయినే ప్రేమించారా ఏమిట్రా!

కు— (చెవులు మూసుకుంటూ) హరహర! పాపము శమించుగాక! నేను ప్రేమించాను. వాడు ప్రేమించాననుకుంటున్నాడు. ఇంతకీ పాపం! వాడికి అనుభవం చాలదు.

మా— నీ కంత అనుభవముంటే మరో అమ్మాయిని ప్రేమించుకో. నీ ఆరోగ్యం బాగుండాలంటే సంధ్య వెంట పడటం మానెయ్యి. ఇంత వరకూ నువ్వుచేసిన తప్పుల్ని క్షమిస్తాను.

కు— చూడు బ్రదర్! నువ్వు నిజంగా ప్రేమిస్తే......

మా— నేనా అమ్మాయిని మనసారా ప్రేమించాను. ఒకళ్ళ హృదయాలు ఒకళ్ళు యిచ్చిపుచ్చుకున్నాం.

కు— ఏడిశావ్! మీరు యిచ్చిపుచ్చుకున్నవి బజార్లో దొరికే ఫౌన్‌టెన్ పెన్నూ జేబురుమ్మాలూను.

మా— అంతా నీ కనవసరం.

కు— నాకు చాలా అవసరం. నేను ప్రేమించిన అమ్మాయిని నువ్వు ప్రేమిస్తున్నానంటే నా హృదయం ఎంత క్షోభిస్తుందో......

మా— నువ్వూ నీ హృదయం కలిసి గోదావర్లో పడండి.

హా— (అనునయంగా) అది కాదురా మార్కండేయుడూ! మొన్న మొన్నటి వరకూ ఆడదంటే హడలి చచ్చేవాడివి, పెళ్ళంటే ఒళ్ళు మంటనేవాడివి. అలాంటిదిఇంతట్లోకే ఈ ప్రేమ దెయ్యం ఎప్పుడు ఆవహించిందిరా.

కు— వాడికి ప్రేమేమిట్రా! వాడిశార్థం! ప్రేమించడమంటే ఫుట్‌బాల్ ఆడడమా! పోనీ ఇప్పుడైనా చెప్పమను. ప్రేమంటే ఏమిటి! వాడి ప్రేమకి నిదర్శనం ఏమిటి!

మా— (స్వాప్నికంగా) సంధ్య రూపాన్ని నా హృదయ ఫలకం మీద చిత్రించుకున్నాను. ఎప్పుడూ ఆ అమ్మాయి నా కూడానే వుండాలనీ, ఆ అమ్మాయితోటే మాట్లాడాలనీ, ఆ అమ్మాయికోసం ఏ త్యాగమైనా చెయ్యాలని ఉంటుంది. కళ్ళు

మూసినా కళ్ళు తెరిచినా సంధ్యే కనబడుతుంది.

కు— ఏడిశావు! కళ్ళుమూస్తే నీకు నిద్రొస్తుంది. కళ్ళుతెరిస్తే ఆకలేస్తుంది. నీకు సంధ్యెప్పుడు జ్ఞాపకముంటుంది! ఆ మాత్రం జ్ఞాపకశక్తే వుంటే ఏనాడో పరీక్ష పేసవుదువు.

మా— నోర్ముయ్. కోపమొస్తే నే మనిషినికాను.

హ— ఒరేయి! కుటుంబం! నువ్వూరుకో. ఉత్తప్పుడే వీడు మృగం. పైగా యిప్పుడు ప్రేమ దెయ్యంకూడా పట్టింది. (మార్కండేయుడితో) నువ్వా సంధ్యని ప్రేమించేవే అనుకో. మరి ఆ అమ్మాయి నిన్ను ప్రేమించక్కర్లేదా?

మా— నేనంటే ఆ అమ్మాయికి పంచప్రాణాలూను.

కు— నువ్వంటే ఆ అమ్మాయికి పరమ అసహ్యం, డోకూను.

మా— ఇన్నాళ్ళూ నా స్నేహితుడువన్న అభిమానంకొద్దీ, నువ్వు నన్ను తాగుబోతన్నా రౌడీ అన్నా క్షమించేను. నువ్వు ఎన్ని కుట్రలూ కుతంత్రాలూ పన్నినా చివరికి సంధ్య నన్నే ప్రేమించింది. సత్యమే జయం! ధర్మమే జయం!! ప్రేమేజయం!!!

కు— నీలాంటి బడుద్ధాయి నే ఆడది ప్రేమిస్తుందిరా!

మా— నీకివ్వాళ తన్నులు తప్పేయోగం లేదు.

కు— తన్నడానికి నేనేం ఫుట్‌బాల్‌ని కాదు. డేష్ కొట్టడానికి వొంటరిగావున్న ఆడపిల్లనీ కాను. ఇదీ మనుషులుండే లోకంరా. మరీ వెర్రి వెర్రి వేషాలేస్తే పదిమందినీ పిలిపించి పట్టించి నిన్ను బందిలిదొడ్డిలో పెట్టిస్తా.

మా— (కుటుంబరావు మీదికి ఉరికి కాలరు పట్టుకుని) సరే ఇప్పుడు చూడు—ఏ పదిమందొచ్చి నిన్ను రక్షిస్తారో!

హ— ఆఁ...ఆఁ...ఆఁ!... ... మార్కండేయుడూ!

మా— నువ్వు కలగజేసుకుంటే నీకూ తగుల్తాయి. ఇవ్వాళ వీడి అంతం చూస్తాను. ఒరేయ్—ఒక్క క్షణం టైమిచ్చాను. నీ ఇష్టదేవతా ప్రార్థన చేసుకో.

కు— (మార్కండేయుడి కాలరు పట్టుకుని) నా యిష్టదేవత సంధ్య.

మా— (గుద్దే ప్రయత్నంలో పిడికిలి బిగించి) మళ్ళీ ఆ మాటెత్తవు కదా!

స— (ప్రవేశించి) స్వామీ! పతిభిక్ష! పతిభిక్ష!

(కుటుంబరావు మార్కండేయుడూ ఒకళ్ళనొకళ్ళు విడిచిపెట్టి కాలర్లు సర్దుకుంటూ చురచుర చూసుకుంటూ వుంటారు. హఠాత్తుగా కూర్చున్న హనుమంతరావు ఆశ్చర్యంగా లేచి సంధ్యదగ్గిర కొచ్చి ఎగాదిగా చూస్తాడు.)

హ— నువ్వెవరు? మా యింట్లోం దెలా ఊడిపడ్డావు! వీళ్ళిద్దరూ బ్రహ్మచారి ముండావాళ్ళే! నీకిందులో పతి యెవరు?

సం— నన్నలా దెయ్యాన్ని చూసినట్టు చూస్తారే! నా పేరు సంధ్య.

హ— (కుర్చీలో కూలబడుతూ) వీళ్ళిద్దర్నీ కాస్తదూరంగా తీసుకెళ్ళి చంపెయ్యి తల్లీ! ఈ హత్యాకాండ మా యింట్లో వొద్దు.

మా— సంధ్యా! నువ్వు ఊఁ... అను ఈక్షణంలోనే నీఎదుటే ఈ కుటుంబ్రావుగాణ్ణి హతమారుస్తా.

సం— మంచి పనిచేస్తారు! కాస్త అభిప్రాయ భేద మొచ్చేటప్పటికి అంతటి ప్రాణస్నేహితుల ప్రాణం తియ్యడానికే సిద్ధపడ్డారే! రేపొద్దున్న మీ పెళ్ళాం తప్పుచేసినా యింతేనా!

కు— సంధ్యా ఇటొచ్చెయ్యి. వాడు పిచ్చివెధవ. కరుస్తాడు.

సం— కరుస్తే కరుస్తారు. ఆయన నా బంగారు కొండ! మధ్యన మీరెవరు? మీరేమైనా నన్ను ప్రేమిస్తున్నారా!

కు— సంధ్యా! నువ్వేనా ఇలా అంటున్నది. నా ప్రేమనే శంకిస్తున్నావా!

సం— నన్ను నిజంగా ప్రేమిస్తున్నారా?

మా— ఏడిశాడు! ప్రేమేవింటి ...ంటి బొంప!

కు— నన్నలా అవమానించకు సంధ్యా! నీకోసం ఏత్యాగమైనా చేస్తాను.

సం— నిజంగానా?

కు— ఆజ్ఞాపించి చూడు.

సం— నన్ను మనః పూర్వకంగా మార్కండేయుడి గారికిచ్చి పెళ్ళి చెయ్యండి.

కు— (గట్టిగా) సంధ్యా!

మా— అబ్బ! ఏమిట్రా అలా ఓండ్ర పెడతావు! సంధ్యకేమీ చెముడు లేదు. ఆమె మనస్సు చెప్పింది. 'యస్సో' 'నో' చెప్పెయ్.

కు— సరే, సంధ్యా! ప్రేమంటే ఏమిటో నీవల్లే తెలుసుకున్నాను. ప్రేమకి త్యాగమే ప్రమాణమయితే... ఇదుగో నా ప్రేమని రుజువు చేసుకోటానికి నిన్ను మార్కండేయుడి చేతుల్లో పెడుతున్నాను. (వాళ్ళిద్దరి చేతులూ కలుపుతాడు.)

మా— నువ్వు ధన్యుడివిరా కుటుంబ్రావ్. నీ ప్రేమ ఆచంద్రార్కం అమరగాథగా సాహిత్య గర్భంలో నిలిచి పోతుంది. నీ త్యాగానికి నా ధన్యవాదాలు. రా సంధ్యా పోదాం.

సం— (మార్కండేయుడి చెయ్యి విదిల్చి) ఎక్కడికి!

మా— మనం హాయిగా వెళ్ళి పెళ్ళి చేసుకుందాం.

సం— మనసారా నన్ను ప్రేమించేరా!

మా— సంధ్యా! నీ కేమయినా మతిపోయిందా !

సం— మతివుంది కనకనే అడుగుతున్నాను. మీకు ప్రేమంటే ఏమిటో తెలుసా? మీరు ఎవర్నీ ప్రేమించలేదు. మీరు మిమ్మల్నే ప్రేమించుకున్నారు. మీ స్వార్ధాన్ని గురించే ఎప్పుడూ ఆలోచించేరు. నన్ను మీరు పెళ్ళాడితే, మిమ్మల్ని పెంచి పెద్దవాణ్ణిచేసి మీ మీదే అన్నిఆశలూ పెట్టుకున్న మీ తల్లితండ్రులు ఎంత బాధపడతారో ఆలోచించేరా? మీకోసం, మీ ప్రేమకోసం అహోరాత్రాలూ తపస్సు చేస్తున్న మా పినతల్లి కూతురు మూలారాణి జీవితం ఏమయిపోతుందో ఆలోచించేరా? అంతటి సుగుణవంతురాల్ని ప్రేమించడం చేతగాని మీరు నన్ను ప్రేమించారా !

మా— మూల మీ పినతల్లి కూతురా !

సం— అవును. మీరు శాపనార్థాలు పెడుతూ పచ్చి అబద్ధాలతో ఆకాశరామన్న ఉత్తరాలురాసి మా చెల్లెలి హృదయంలో చిచ్చుపెట్టేరు.

మా— ఆ వెధవ రాతలన్నీ రాసింది ఈ కుటుంబరావుగాడు.

కు— పెళ్ళి ఆపకపోతే చస్తానంటే అలా రాశాను. వాడి మేనమామ ఆ ఉత్తరాలకట్ట నీకు పంపిస్తాడని కలగన్నానా !

సం— ఇలాంటి మనస్సు నిలకడలేని మనుషులు బతకడంకంటె చావడమే మంచిది. అటు దాని ప్రాణాలు తీసేరు. ఇటు నన్ను ప్రేమించేరుట! పెళ్ళిచేసుకుంటారుట !

మా— ఆఁ... ...మూల చచ్చిపోయిందా !

సం— అది చస్తేయేం! మీరు రాయిలా వున్నారు చాలదూ! ఛీ! మీ మొహం మళ్ళీ నాకు చూపెట్టకండి.

మా— సంధ్యా ! నేను రాక్షసుణ్ణి. ప్రేమంటే ఏమిటో తెలీక నా మూలను పొట్టబెట్టుకున్న మహాపాపిని. ఛీ! ఈ జన్మెందుకు! వెంటనే చచ్చి పరలోకంలో వున్న మూల కాళ్ళమీదపడి ప్రేమభిక్ష వేడుకుంటాను.

సం— మీ కది సాధ్యంకాదు. మా మూలారాణి స్వర్గంలోవుంటుంది మీరు చస్తే నరకాని కెడతారు.

మా— అయితే నా పాపానికి నిష్కృతిలేదు. నాకు తరణోపాయం లేదు.

మూల (ప్రవేశిస్తూ) ఉందిబావా ! నన్ను పెళ్ళాడు !

మా— నువ్వు బతికేవున్నావా మూలా !


మూ— నీకోసమే బావా !

మా— మూలా ! (మూలచేతులు తన చేతుల్లో అందుకుంటాడు.)

మూ— బావా ! (ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకు నిష్క్ర







మిస్తారు.—కుటుంబ్రావు, సంధ్యా వాళ్ళవైపే చూస్తూ మౌనంగా వుంటారు. నెమ్మదిగా హనుమంతరావు కుర్చీలోంచి లేచి గొంతు సవరించుకుని సంధ్యవైపు వస్తాడు.)

హ— చూడమ్మాయ్! నువ్వా ఆ అమ్మాయి, ఆ ముసలాయినా మా యింటికొస్తే మా అవిడతరపు బంధువులే అని నమ్మేను.

సం— నిజంగాకూడా బంధువులమేనండి. దూరపుబంధుత్వం, అయితేయేం! ఎంతో ఆదరంతో సహకారంతో మీ అవిడ ఈ సమావేశాన్నిక్కడ ఏర్పాటుచేశారు.

హ—ఓహో! అలాగా! చూడు, మిస్ సంధ్యా. నాకు ఇద్దరే ఇద్దరు ప్రాణమిత్రు లున్నారు. ఒకడు మార్కండేయుడూ. రెండోవాడు ఈ కుటుంబరావు. వీళ్ళిద్దరయినా బ్రహ్మచారులుగా వుండి సుఖపడతారేమోనని ఆశపడ్డాను. నీ మహేంద్రజాలంతో మార్కండేయుడి బ్రహ్మచర్యం నేటితో అంతం చేశావు. కనీసం ఈ కుటుంబరావునైనా బ్రహ్మచారిగా బతక నిస్తానని నాకు వరం ప్రసాదించు.

సం— అది నాతరం కాదు. నా హృదయం ఆయనకి ఏనాడో అంకితం చేశాను. ఆయన కాదంటే నాకు మరణమే శరణ్యం.

కు— సంధ్యా! నిజంగానా? (దగ్గిరికొచ్చి చెయ్యిపట్టుకుని) నేను చాలా అదృష్టవంతుణ్ణి.

హ— దౌర్భాగ్యుడా! కుటుంబరావ్! చూస్తూ చూస్తూ సంసార నరకంలో పడిపోతున్నావ్!

కు— (సంధ్యతో సహా నిష్క్రమిస్తూ) లాభంలేదు బ్రదర్! పదిమందితోపాటు చావుకూడా పండుగేనన్నారు ... టాటా !!

[హనుమంతరావు హతాశుడై కుర్చీలో కూలబడతాడు. తెరలోంచి అతని భార్య "ఏమండీ వాళ్ళందరూ వెళ్ళిపోయారా?" అంటుంది.

కుటుంబరావ్ పరధ్యానంలో పలకక పోతే గట్టిగా "ఏమండీ, మిమ్మల్నే" అని కేకేస్తుంది. హనుమంతరావు 'ఆఁ ఆఁ' అంటూ త్రుళ్ళిపడి లేచి తెర లోంచి వినబడే భార్య ప్రశ్నలకి సమాధాన మిస్తూంటాడు.]

హ. భా— ఎంత పిలిచినా పలక రేమండీ! నిద్రోతున్నారా!

హ— లేదు. ఏదో మూర్ఛ వొచ్చినట్టయింది.

హ. భా— ఈ సంసారం ముచ్చట కింక మూర్ఛరోగం రావడమే తరవాయి. సరేకాని... మా కాంతారావు అన్నయ్య మన పిల్లల్ని వెంటబెట్టుకు ఊర్లో కెళ్ళేడు. ఈ' వూరుకొత్త. ఏమయిపోయేరో ఏమో, కొంచెం వెళ్ళి వెతుకుదురూ.

హ— అలాగే.


హ. భా— ఎలాగా బయటు కెడుతున్నారు కనుక తమలపాకులు కూడా తీసుకురండి ...

హ— అలాగే.

హ. భా— వచ్చేటప్పుడు దార్లో... ...

హ— అలాగే! అలాగే! (నిష్క్ర మిస్తాడు)

□□□




# శోకాలూ - శ్లోకాలూ

'మానిషాద' మహా శ్లోకం
సంస్కృతంలో ఆదిరస్తా,
వాల్మీకి సౌజన్యముతో
తెల్గులో నే నలా రాస్తా!

●

టాగూరేమో మిస్టిసిజం
గోంగూరేమో ఆంధ్రాయిజం
ఏమీకాంది ఎక్కడుంది?
లేకేం భాయీ, ఉంది హిందీ!

●

పల్క లేని పదాలన్నీ
కలిపేద్దామా గంగలో—
నగ్నం ఎలాగైందో "నంగా"
సిగ్నల్ అలాగే ఔ "సింగల్."

●

గురజాడ కవే కాడు!
మహాత్ముడా ఏమిగాంధీ!!
గురూ, ఏమేనా అంటాడు,
పేరుకోస మిదో రంధీ!!!

●

పోరు నష్టం, పొందు లాభం
అంటే అర్థం చెబతారూ?
ఓ యస్, నువ్వు పొందు లాభం
నష్టపోరులే ఎవరూ!

●

అందలం అంతా ఎక్కితే
మోసేవా రెవరంటావా?
కారు స్విచ్ నీవే నొక్కితే
స్వయంగా మోసుకుంటావా!

●

మాటల్లో ఉన్న మార్దవం
మింగిందీ గాన గార్దభం
సరిపోయిందీ అంతతో
చచ్చింది అర్థం స్వరంతో!

●

కొనుక్కోవాలంటే బియ్యం
క్యూలో తప్పదయ్యా కయ్యం!
ఎందుకూ మా కీ జీతాలూ
ఇచ్చికూడదా భత్యాలూ!

వజ్ఝల కాళిదాసు